ప్రజాశక్తి

సోమవారం 3 నవంబర్ 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

పంచాయతీలకు కొత్తరూపు

- నాలుగు గ్రేడ్‌లుగా విభజన
- కృష్ణాలో 17 రూర్బన్ పంచాయతీలుగా గుర్తింపు
- ప్రత్యేక సిబ్బంది నియామకం

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

గ్రామ పంచాయతీలను స్వతంత్ర సంస్థలుగా మార్చేందుకు క్లస్టర్ వ్యవస్థను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. పంచాయతీరాజ్ శాఖ రూపురేఖలు మార్చేస్తోంది. తాజాగా ఐదు రకాల గ్రామ పంచాయతీలను నాలుగు గ్రేడ్‌లుగా కుదించింది. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా గ్రామ పంచాయతీ ఆదాయం, జనాభా ప్రాతిపదికలను పరిగణనలోకి తీసుకుని జిల్లాలోని పంచాయతీలను నాలుగు గ్రేడ్‌లుగా విభజించారు. ఈ గ్రేడ్‌ల ప్రాతిపదికన పంచాయతీ కార్యదర్శులను పంచాయతీ అభివృద్ధి అధికారి(పిడివో)గా పేరు మార్చడానికి కసరత్తు జరుగుతోంది.

కృష్ణాజిల్లాలో మొత్తం 497 గ్రామ పంచాయతీలున్నాయి. పంచాయతీల్లో పట్టణ తరహా సేవలు అందుబాటులో ఉంచుతామని చెబుతూ అత్యధిక ఆదాయం, జనాభా



ప్రాతిపదికన 17 రూర్బన్ (స్పెషల్ గ్రేడ్) పంచాయతీలుగా గుర్తించారు. పది వేలకు పైగా జనాభా, కోటి రూపాయలకుపైగా ఆదాయం కలిగిన అవనిగడ్డ, చల్లపల్లి, పామర్రు, గన్నవరం, బాపులపాడు, కంకిపాడు, పెనమలూరు, కీసరపల్లి, సూరంపల్లి, పునాదిపాడు, ఈదుపుగల్లు, ముస్తాబాద, గంగూరు, కోడూరు, లక్ష్మీపురం, గుడ్లవల్లేరు, బుద్దవరం పంచాయతీలను రూర్బన్ పంచాయతీలుగా మార్చుతున్నారు. రూర్బన్ పంచాయతీల్లో పరిపాలనా విభాగాలు (గ్రామీణ ప్రణాళిక, ప్రజారోగ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా, ఇంజనీరింగ్)లను ఏర్పాటు చేసి ఆయా విభాగాలకు ప్రత్యేక సిబ్బందిని నియమిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇల్లు, భవన నిర్మాణాల అనుమతులు, అక్రమ నిర్మాణాల నియంత్రణకు పురపాలక సంఘాల్లో మాదిరిగానే కంట్రీ ప్లానింగ్ విభాగాన్ని ఏర్పాటు చేస్తారు. సచివాలయాల్లో అధికంగా ఉన్న ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్‌లను రూర్బన్ పంచాయతీల్లో గ్రామీణ ప్లానింగ్ అసిస్టెంట్‌లుగా నియమించి సంబంధిత విభాగాల్లో విధులు అప్పగించనుంది. నాలుగు వేలకుపైగా పది వేలలోపు జనాభాను రూ. 50 లక్షల నుంచి రూ.కోటి ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకుని 60 పంచాయతీలను గ్రేడ్ వన్ పంచాయతీలుగా, రెండు వేల నుంచి నాలుగు వేల జనాభా ప్రాతిపదికన 139 పంచాయతీలను గ్రేడ్ టూ పంచాయతీలుగా, 2 వేల లోపు జనాభాను పరిగణనలోకి తీసుకుని 281 గ్రేడ్ త్రీ పంచాయతీలుగా మార్చడానికి ప్రాథమిక నివేదిక సిద్ధం చేశారు.

గ్రామ పంచాయతీల్లో ఎపిడిఓ

గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు ప్రధాన విధులు నిర్వహిస్తున్నారు. పాలక వర్గాల ఆమోదించిన తీర్మానాల అమలు, పంచాయతీల్లోని ఇతర విభాగాల పర్యవేక్షణ తదితరాలు గ్రామ కార్యదర్శుల విధులుగా ఉన్నాయి. తాజాగా పంచాయతీ కార్యదర్శులను పంచాయతీ అభివృద్ధి అధికారిగా మార్చుతున్నారు. రూర్బన్ పంచాయతీల్లో డిప్యూటీ మండల పరిషత్ అధికారిని నియమిస్తారు. గ్రామ పంచాయతీల్లోని వివిధ శాఖల ఉద్యోగులు విధులను ఎపిడిఓ, డిప్యూటీ మండల పరిషత్ అధికారులు పర్యవేక్షిస్తారు.

కిడ్నీ వ్యాధితో ఒకరు మృతి

ప్రజాశక్తి-ఎ.కొండూరు

ఎ.కొండూరు మండలంలో కిడ్నీ వ్యాధితో ఒకరు మృతిచెందారు. కృష్ణారావుపాలెం పంచాయతీ శివారు దీప్లానగర్ తండాకు చెందిన జరపల మంగ్యా నాయక్ (50) డయాలసిస్ చేయించుకుంటూ శనివారం రాత్రి మృతిచెందినట్లు



కుటుంబసభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మంగ్యానాయక్ గత ఐదు సంవత్సరాల నుండి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడని, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షలు ఖర్చు చేశాడని, అరెకరం భూమి అమ్మాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మంగ్యానాయక్ మృతదేహాన్ని సిపిఎం నాయకులు సందర్శించారు. నిరుపేద కుటుంబం కావటం వల్ల ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకోవాలని, కృష్ణాజలాల పైప్‌లైన్‌ను త్వరగా పూర్తి చేయాలని, ఎ.కొండూరు మండలంలో కిడ్నీ ఆసుపత్రి నిర్మించాలని, ఉచితంగా (మిగతా 2లో)

మొంథాతో 32,646 ఎకరాల్లో పంట నష్టం

- 15 గ్రామాలపై మున్నేరు వరద ప్రభావం
- ముమ్మరంగా ఎన్యుమరేషన్
- ఎన్‌టిఆర్ జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి





ప్రజాశక్తి-విజయవాడ

మొంథా తుపానుకు దెబ్బతిన్న పంటల పూర్తిస్థాయి వివరాల సేకరణ (ఎన్యుమరేషన్) కార్యక్రమం ముమ్మరంగా జరుగుతున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి పేర్కొన్నారు. తుపాను ప్రభావం కన్నా మున్నేరు వరద వల్ల పలు గ్రామాల్లో వివిధ రకాల పంటలు ముంపునకు గురై దెబ్బతిన్నాయనితెలిపారు. పెనుగంచిప్రోలు, నందిగామ, వత్సవాయి, జగ్గయ్యపేట తదితర మండలాల పరిధిలోని 15 గ్రామాలకు పైగా పంటలపై మున్నేరు ప్రభావం తీవ్రంగా ఉందని చెప్పారు. మొంథా తుఫాను ప్రభావం, పంటల నష్టంపై ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

ప్రశ్న: ఎన్ని ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి?

జవాబు: తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా 32,646 ఎకరాల్లోని వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. వాటిల్లో వరి పంట 8,345 ఎకరాల్లో, పత్తి 21,012 ఎకరాలు, మినుము 1508 ఎకరాలు, మొక్కజొన్న 1747 ఎకరాలు, పెసర 50 ఎకరాలు, చెరకు 20 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా.

ప్రశ్న: ఏ మండలాల్లో ప్రభావం ఉంది?

జవాబు: జి.కొండూరు, విజయవాడ రూరల్, గంపలగూడెం, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం, చందర్లపాడు, పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట, విసన్నపేట, తిరువూరు, ఎ. కొండూరు, రెడ్డిగూడెం, వత్సవాయి, మైలవరం, విజయవాడ ఉత్తర మండలాల పరిధిలోని గ్రామాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి.

ప్రశ్న: పంటల నష్టం వివరాలు తెలపగలరు?

జవాబు: క్షేత్ర స్థాయిలో వ్యవసాయ సిబ్బంది దెబ్బతిన్న పంటలకు సంబంధించి సేకరించిన వివరాల ప్రకారం ఆయా మండలాల పరిధిలోని గ్రామాలకు సంబంధించి సర్వే నిర్వహించిన వ్యవసాయ పంటల భూములు 6,254 హెక్టార్లు, ఎన్యుమరేటెడ్ ఏరియా 2,201.03 హెక్టార్లు, వీటిల్లో ఆమోదించబడిన ఏరియా 1,150.57 హెక్టార్లు, తిరస్కరించిన ఏరియా 8.68 హెక్టార్లు, పెండింగ్‌లో ఉన్న ఏరియా 1041.78 హెక్టార్లు.

ప్రశ్న: ఈ ఖరీఫ్‌లో వరి సాగు ఎంత విస్తీర్ణంలో జరిగింది?

జవాబు: 1,34,824 ఎకరాల్లో (మిగతా 2లో)

అంబేద్కర్ స్మృతివనం కార్మికుల విజయం

- సిఐటియు పోరాట ఫలితం
- ఆరు నెలల జీతం ఏజెన్సీ చెల్లింపు
- కార్మికులు దీక్ష విరమణ

ప్రజాశక్తి-విజయవాడ: అంబేద్కర్ స్మృతివనం కాంట్రాక్టు కార్మికులు పోరాడి విజయం సాధించారు. సిఐటియు ఆధ్వర్యంలో నెల రోజుల పోరాట ఫలితంగా తొమ్మిది నెలలకు ఆరు నెలల జీతం రూ.9 లక్షలు ఇచ్చేందుకు ఆర్కే ఏజెన్సీ సర్వీస్ అంగీకరించింది. పెండింగ్ జీతాలను నెల రోజుల్లో ఇస్తామని హామీనిచ్చింది. దీంతో రెండు రోజు దీక్షను ప్రారంభించిన సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు కార్మికులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, ఆర్కే సర్వీస్ ఏజెన్సీ చేతుల మీదుగా కార్మికులకు ఆరు నెలలు జీతాలు అందజేశారు. ఈ సందర్భంగా కాశీనాథ్, మాల్యాద్రి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్మృతివనంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న తొమ్మిది నెలల జీతాలు



దీక్షను విరమింపజేస్తున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కాశీనాథ్

ఇవ్వాలని కార్మికులు, సిఐటియు నాయకులు అనేక రూపాల్లో ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. 30 రోజులు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు చేసిన పోరాట ఫలితంగా 21 మంది కార్మికులకు జీతాలు ఇప్పించినట్లు చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల భవిష్యత్తు అంధకారంగా మారిందని, ముఖ్యంగా అసంఘటిత రంగ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వకుండా (మిగతా 2లో)

జోగి రమేష్ అరెస్టుతో ఉద్రిక్తత

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం,విజయవాడ అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కల్తీ మద్యం కేసులో వైసిపి నేత, మాజీ మంత్రి జోగి రమేష్‌ను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలోని ఆయన నివాసానికి సిట్ అధికారులు వెళ్లారు. జోగి రమేష్ నివాసంలో తనిఖీలు నిర్వహించారు. జోగి రమేశ్, ఆయన భార్య ఫోన్లను అధికారులు సీజ్ చేశారు. ఆయన నివాసంలో సీసీ ఫుటేజీని స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న జోగి అనుచరులు ఆయన ఇంటి వద్ద బైటాయించారు. తమ నాయకుడిని అక్రమంగా అరెస్టు చేస్తున్నారంటూ నిరసన తెలిపారు. అనంతరం జోగి రమేష్‌తో పాటు ఆయన అనుచరుడు ఆరేపల్లి రామును పోలీసులు అరెస్ట్ చేశారు. జోగి రమేష్‌ను విజయవాడలోని ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. జనార్ధనరావుతో గల ఆర్థిక సంబంధాలపై ప్రశ్నలు సంధించారు. రమేష్‌ను సుమారు ఏడు గంటల పాటు విచారించారు. ఈ కేసులో ఎ18గా జోగి రమేష్‌ను, ఎ19గా జోగి సోదరుడు రామును అధికారులు చేర్చనున్నారు. జోగి రమేష్‌ను ఆదివారం రాత్రి వైద్య పరీక్షల కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. రమేష్‌ను ఆసుపత్రికి తీసుకువస్తారనే సమాచారంతో అక్కడే ఉన్న జోగి రమేష్ అనుచరులు, వైసిపి కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



విజయవాడ ప్రభుత్వాసుపత్రి వద్ద ఉద్రిక్తత

దీంతో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. జోగి రమేష్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, జోగి రమేష్ అనుచరులకు మధ్య వాగ్వివాదం జరగడంతో వారి మధ్య తోపులాట జరిగింది. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. జోగి రమేష్, రాములకు వైద్య పరీక్షల అనంతరం పోలీసులు ఎక్సైజ్ కోర్టులో వారిని హాజరుపరిచారు.

స్టేడియంలో క్రికెట్ అభిమానుల సందడి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్యాన్ పార్క్ కు నగరవాసులు, క్రికెట్ అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో ఐసిసి వుమెన్ వరల్డ్ కప్ 2025 ఇండియా -సౌతాఫ్రికా ఫైనల్ మ్యాచ్ చూసేందుకు మూడు బిగ్ స్క్రీన్స్ ఏర్పాటు చేశారు. స్టేడియంలో బిగ్ స్క్రీన్ పై మ్యాచ్ ను వీక్షించేందుకు విచ్చేసిన క్రికెట్ అభిమానులకు గ్యాలరీలు ఏర్పాటు చేశారు. కొంత మంది క్రికెట్ అభిమానులు స్టేడియంలోని స్టాండ్స్ పై నుంచి వీక్షించారు. ఇండియా టీమ్ బ్యాటింగ్ చేసే సమయంలో బౌండరీలు, సిక్సర్లు కొట్టిన ప్రేక్షకులు చప్పట్లు , కేరింతలు కొడుతూ సందడి చేశారు. మహిళ క్రికెట్ ను ప్రోత్సాహించాలనే ఉద్దేశ్యంతో ఏసీఏ ఏర్పాటు చేసిన ప్యాన్ పార్క్ అధిక సంఖ్యలో మహిళలు రావటం విశేషం, క్రికెట్ అభిమానులు ఇండియా టీమ్ కు సపోర్ట్ గా జాతీయ జెండాలను రెపరెపలాడితూ మద్దతుగా నిలిచారు. మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమైన...మ్యాచ్ ను చివరి వరకు ఆసక్తిగా తిలకించారు. ఏసీఏ రాష్ట్ర వ్యాప్తంగా విజయవాడలోనే కాకుండా వైజాగ్ లో



రెండు కళాశాల్లో, కాకినాడలో ఒక కళాశాలలో ప్యాన్ పార్క్ ఏర్పాటు చేసి ఇండియా-సౌతాఫ్రికా మ్యాచ్ చూసేందుకు బిగ్ స్క్రీన్స్ ఏర్పాటు చేయటం జరిగింది.





రైతులకు నష్టాన్ని మిగిల్చిన మొంథా

ప్రజాశక్తి- నందిగామ

రైతులు ఆరుగాలం కష్టించి సాగుచేసిన మాగాణి పంట చేతికొచ్చేసమయంలో ఆకాల వర్షాలకు మింగేసింది. గత ఏడాది మునేరు తువ్వకాలువకు, మైసమ్మ గండ్లను నేటి వరకు పూడ్చకపోవటంతో మొంథా తుపాను ప్రభావంతోపాటు తెలంగాణలో కురిసిన ఆకాల వర్షాలకు మునేరుకు వచ్చిన భారీ వరద మైసమ్మ గండి ద్వారా ప్రవహించి సమీపంలోని వరి పొలాలను ముంచెత్తింది. మునేరుకు వరద తగ్గినా మూడు, నాలుగు రోజులుగా పొలాలపై పారిన వరద నీటిలోనే నేటికి వరి పంట నానుతుంది. నందిగామ మండలం ఐతవరం నీటమునిగిన వరి కంకులను రైతులు బయటికి తీసి ఎండకు ఆర పెడుతున్నారు. నందిగామ మండలం లో 30 వేల యకరాలలో మాగాణి పంట ఆకాల వర్షాలకు నీట మునిగి కొన్ని చోట్ల నేటివరకు వరద నీటిలోనే నానుతుంది.

తాలుగా మారుతున్న గింజలు

మండలంలో కోతకు వచ్చిన వేలాది ఎకరాల్లోని వరి పంటంతా ఈ తుఫాను దెబ్బకు నీట మునిగే ఉంది. వరి కంకులు నీటిలో తేలియాడుతున్నాయి. మూడు రోజులుగా వరద నీటిలో నానుతూనే ఉండటంతో గింజ తాలుగా మారి పనికిరాకుండా పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మువేరు గండ్లకు పంటలతోపాటు ఈ ఏడాది ఖరీఫ్ ను కూడా కోల్పోయింది. ప్రభుత్వం గండ్లను పూడ్చకపోవడంతో గతేడాది పంటలు కోల్పాయామని బాధిత రైతులు వాపోతున్నారు. ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30వేలు పెట్టుబడి పెట్టామని, కనీసం సాగు ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేకుండాపోయిందని రైతులు ఆందోళనే చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం అందించి అదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

తుఫాన్ సమసిపోయినా వరద నీరు మాత్రం వంట పొలాలను వీడటం లేదు. మండలంలోని మాగల్లు గ్రామం, ఐతవరంతో పాటు చందర్లపాడు మండలంలోని తోటరావులపాడు చింతలపాడు, తుర్లపాడు, ఏటూరు గ్రామాల్లోని పరిపాలాలు ఇంకా నీటిలోనే నానుతున్నాయి. రోజుల తరబడి వరద నీటిలో నాను తుండటంతో వరిపంటను పూర్తిగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్ట పరిహారం అం దించాలని లేకుంటే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు విలపిస్తున్నారు. మునేరుకు పడిన గండ్లు పూడ్చకపోవటంతో కోత దశలో ఉన్న మూడక రాల్లోని వరిపంట పూర్తిగా నీటమునిగింది. వరి కంకులు నీటిలో నానుతున్నాయి. వరుసగా రెండో ఏడారి కూడా వంటలు నీ మునడంతో కోలుకోలేని పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం ఇచ్చి అదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అవినీతిపై పోరాటానికి ముందుకు రావాలి

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: సమాజాభివృద్ధికి అవినీతి అవరోధంగా ఉందని దాన్ని పారదోలాల్సిన అవసరం ఉందని ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్ సింగ్ అన్నారు. విజిలెన్స్ అవేర్నెస్ వీక్ -2025 లో భాగంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం ఉదయం సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్ సింగ్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి రోజున అవినీతికి వ్యతిరేకంగా విజిలెన్స్ అవేర్ నెస్ వీక్ ను చేపట్టడం జరుగుతుందన్నారు. నవంబర్ రెండో తారీకు వరకు దీనిపై ప్రజల్లో దేశవ్యాప్తంగా అవగాహన కల్పిస్తారన్నారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా సైకిల్ ర్యాలీని చేపట్టామన్నారు. రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతిలలో కూడా సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధికి అడ్డుగోడగా ఉన్న అవినీతిని పారదోలాల్సి ఉందన్నారు. అవినీతి అనేది రెండువైపులా అంటే ఇచ్చే వారు



పుచ్చుకునే వారిపై ఆధారపడి ఉంటుందన్నారు. ఏదైనా అవినీతిపై మీరు ఫిర్యాదు చేయాలనుకుంటే 1064 కు కాల్ చేయవచ్చాన్నారు. దీనిపై వెంటనే అవినీతి నిరోధక శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. అవినీతిపై పోరాటంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నుంచి మనకి చాలా సపోర్టు ఉందని తెలిపారు.. ఉదయమే సైకిల్ ర్యాలీలో పాల్గొన్న అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుండి ప్రారంభమైన సైకిల్ ర్యాలీ బెంజ్ సర్కిల్ బందరు రోడ్డు మీదుగా పోలీస్ కంట్రోల్ రూమ్ నుండి ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం కు చేరుకుంది. సైకిల్ ర్యాలీలో ఎసిబి డైరెక్టర్ ఆర్.జయలక్ష్మి, హెడ్ క్వార్టర్స్ అడిషనల్ ఎస్పీ సుధాకర్, అడిషనల్ ఎస్పీలు మహేందర్, దిలీప్ కిరణ్ పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : ఎస్‌కెపివి హిందూ హైస్కూల్ 1989- 90వ సంవత్సరపు పూర్వ విద్యార్థుల కలయిక హిందూ హైస్కూల్లో ప్రాంగణంలో ఆదివారం ఘనంగా జరిగింది. 1989-90 పదో తరగతికి చెందిన సుమారు 150 మంది పూర్వ విద్యార్థులు, 12 మంది అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి మధుర అనుభూతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ముందుగా పూర్వ విద్యార్థులందరూ తమ పరిచయ కార్యక్రమం చేసుకున్న అనంతరం అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమ గురువుల విద్యా బోధన, క్రమశిక్షణ, నిజాయితీ, సామాజిక బాధ్యత పలు అంశాలపై తమను గొప్పగా తీర్చిదిద్దినందున ఈ రోజున తామంతా ఉన్నత స్థాయిలో ఉన్నామని హర్షం వ్యక్తం చేశారు.

రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ

రుతువులు మారినప్పుడల్లా, మన ఆరోగ్యంపై వాటి ప్రభావం కూడా మారుతుంది అని,రోగనిరోధక శక్తిని పెంచేందుకు బాదం ఉపయోగపడుతుందని ప్రముఖ డైటేసియన్ రీతిక ఒక ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలలో హెచ్చుతగ్గులు, అలర్జీ కారకాల బారిన ఎక్కువగా పడటం, రోజువారీ దినచర్యలో మార్పులు... ఇవన్నీ మన రోగనిరోధక వ్యవస్థపై భారాన్ని పెంచుతాయి. అన్నారు .దీనివల్ల మనం జలుబు, ఫ్లూ, అలసట బారిన సులభంగా పడే అవకాశం ఉంన్నారు. బలమైన రోగనిరోధక వ్యవస్థకు సమతుల్య ఆహారం, మంచి అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవనశైలి ఆధారం. అని బాదం, ఆకుకూరలు, కొవ్వు ఉండే చేపలు వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని చేర్చుకోవాలని తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

కిడ్నీ వ్యాధితో ఒకరు మృతి

మందులు పంపిణీ చేయాలని, పోషకాహారం అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. మృతదేహాన్ని సిపిఎం మండల కార్యదర్శి పానెం ఆనందరావు, నాయకులు ఆళ్ల అమ్మిరెడ్డి, టిడిపి నాయకులు పిన్నమనేని శ్రీనివాసరావు, బాలాజీ సందర్శించి కుటుంబానికి సానుభూతి తెలిపారు. అనంతరం విఆర్‌ఓ రాణి చేతుల మీదుగా మట్టి ఖర్చుల నిమిత్తం 10 వేల రూపాయలను కుటుంబ సభ్యులకు అందజేశారు. గ్రామ సర్పంచ్ పర్వతనేని నాగమల్లేశ్వరి, వైసిపి మండల సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ పర్వతనేని చంద్రమోహన్ రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

అంబేద్కర్ స్మృతివనం కార్మికుల విజయం

కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కనీస వేతనాలు అమలు కావడంలేదన్నారు. హక్కులు, జీతాలు, ఈఎస్‌ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాల కోసం సిఐటియు చేసే ఆందోళన కార్యక్రమంలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు క్రాంతికుమార్, సిఐటియు నాయకులు ఎం.బాబురావు, వై.సుబ్బారావు, ఎం.సోమేశ్వరావు, అంబేద్కర్ స్మృతివనం కాంట్రాక్ట్ కార్మికులు పి.సునీత, పి.విజయ్ కుమారి, పి.మేరీ, ఎం.సుజాత, యం.దీపిక, కె.అనూష, పి.సత్యవతి, కె.ధనలక్ష్మి, సిహెచ్ మల్లిక, కె.హరిత, ఎల్.తేరోజమ్మ, సత్యవతి, ఎస్‌కె జుబేదా తదితరులు పాల్గొన్నారు.

మొంథాతో 32,646 ఎకరాల్లో పంట నష్టం

రైతులు వరి సాగు చేశారు. జొన్న 51 ఎకరాల్లో వేశారు.

ప్రశ్న: పంటలు కోలుకునేందుకు తీసుకుంటున్న చర్యలేమిటి?

జవాబు: మొంథా తుపాను కారణంగా జిల్లాలో దెబ్బతిన్న పంటలు తిరిగి కోలుకునే దిశగా వరి, పత్తి, మొక్కజొన్న, చెరకు, వేరుశెనగ, కంది, మినుము, పెసర పంటలలో తీసుకోవాల్సిన సత్వర చర్యలపై రైతులకు అవగాహన కల్పించడానికి ఇప్పటికే ప్రభుత్వం పలు రూపాల్లో సూచనలు, సలహాలు అందజేసి విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించడం జరిగింది. వాటికనుగుణంగా రైతులు జాగ్రత్తలు పాటించాలి.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు

రోడ్డు భద్రతపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. రవీంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వాలంటీర్లు రోడ్డు భద్రతపై వాహనదారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కోరుతూ స్థానిక నెహ్రూ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రమాదాలను అరికట్టేందుకు చిన్న వయసు నుంచే చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. వేగంగా వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, అతి వేగం వల్ల విలువైన ప్రాణాలు పోతున్నాయని తెలిపారు. ర్యాలీలో విద్యార్థులతో పాటు ఎన్ఎస్ఎస్ పి.ఓ. టి.జె. సతీష్ చంద్ర, కోఆర్డినేటర్ జి.జీవన్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం జరుగుతుందన్నారు. అలాగే మీకోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడం తోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు.

ఘనంగా రథోత్సవం

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : కార్తీకమాసం సందర్భంగా చిలకలపూడిలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పాండురంగడు దేవస్థానంలో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహించారు. పాండురంగని పంచలోహ విగ్రహాలు రథంలో అలంకరించారు. పట్టణ నగర వీధులలో మేళతాళాలతో వివిధ రకాల వేషధారణలతో బయలుదేరిన ఊరేగింపు ప్రతి వీధిలోను భక్తులు ప్రజలు హారతులు నడుమ ఎంతో భక్తి భావంతో కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కష్ణా జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పంచ పర్వాల కాశి విశ్వనాథ్, పంతం గజేంద్ర, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, గోల్డ్ ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు, జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డం రాజు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు : సిఐ



ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : తల్లిదండ్రులు తమ పిల్లలకు ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని ట్రాఫిక్ సిఐ నున్న రాజు అన్నారు. ఆదివారం మచిలీటపట్నంలో ప్రత్యేక వాహన డ్రైవ్ నిర్వహించారు. వివిధ ప్రాంతాలలో డ్రైవింగ్ చేస్తున్న మైనర్‌లు సుమారు 25 మందికి కౌన్సిలింగ్ నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించి జరిమానా విధించారు. అనంతరం సిఐ మాట్లాడుతూ కృష్ణా జిల్లాలో ఈ మధ్య కాలంలో జరిగిన రహదారి ప్రమాదాల్లో ఎక్కువ శాతం మంది యువకులే బలయ్యారని, సరదా కోసం వాహనాల జోలికెల్లి ప్రమాదాల బారిన పడవద్దని యువకులకు సూచించారు. అదేవిధంగా తల్లిదండ్రులు పిల్లలకు వాహ నాలు ఇవ్వ కుండా తగు జాగ్రత్తలు తీసుకో వాలని, బయటకు వెళ్ళిన తమ పిల్లలపై ప్రత్యేక దష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కళ్ళజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : సమాజంలో నిరుపేదలకు వైద్యం సహాయం చేసి ఉచితంగా కళ్ళజోళు ్ళ పంపిణీ చేయడం అభినందనీయమని ఆర్‌పేట సిఐ ఏసుబాబు కొనియాడారు. ఇటీవల రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ మైనారిటీ నాయకులు డాక్టర్ హాసీం బేగ్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆయన పుట్టినరోజు సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించి, ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఆదివారం కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. హ్యూమానిటీ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ హసీమ్ బేగ్ కి ఆత్మీయ అభినందన కార్యక్రమం భాస్కరపురం లోని సనస్టార్ స్కూల్ ప్రాంగణంలో హ్యూమానిటీ ఫౌండేషన్ ఫౌండర్ నూర్జహాన్ ఘనంగా నిర్వహించారు. హ్యూమానిటీ ఫౌండేషన్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా గవర్నమెంట్ హాస్పిటల్ డాక్టర్ జి భాను మూర్తి ద్వారా నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో అర్హులైన 110 మందికి ఉచితంగా కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. 29 మంది కి ఉచితంగా కంటి ఆపరేషన్ లను త్వరలో చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ సాయి స్వరూప్, హ్యూమానిటీ అధ్యక్షురాలు నూర్జహాన్, ట్రెజరర్ నాగూర్ హుస్సేన్, సెక్రటరీ అజ్మా తున్నిసా,అనిల్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు, ఎల్ఐసి యూనియన్ నాయకులు జి కిషోర్ కుమార్ కుమార్, ఉపాధ్యక్షులు బొమ్మిడి స్వామి పాల్గొన్నారు.


కళ్ళజోళ్ళు పంపణీ చేస్తున్న సిఐ ఏసుబాబు

శిఖర ప్రతిష్ట విజయవంతంపై ప్రశంసలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ గంగానమ్మ దేవస్థానాల జీర్ణోద్ధరణ పనులను పూర్తి చేసి శిఖర ప్రతిష్టను విజయవంతంగా నిర్వహించారని పలువురు ఆదివారం ఆలయ అభివద్ధి కమిటీ నిర్వాహకుల్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా దేవస్థాన అభివృద్ధికి కృషి చేసిన ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్యచౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, యలమంచిలి రామ కొటేశ్వరరావును దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఎర్రంనాయుడికి ఘన నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : టిడిపి సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి కింజారపు ఎర్రంనాయుడు వర్ధంతిని అవనిగడ్డ టిడిపి కార్యాలయంలో నిర్వహించారు. ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎర్రమనాయుడు చిత్రపటానికి పూలదండలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పర్చూరి. దుర్గాప్రసాద్, బండే రాఘవ, షేక్ బాబావాలి, దాసినేని శ్రీనివాసరావు, మేడికొండ విజయ్, కమ్మిలి సుబ్రమణ్యం, మెరుగు సోమిరెడ్డి, మెరుగు రంగనాథ్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** స్థానిక నీలామహాల్ రోడ్డులోని ఎర్రంనా యుడు విగ్రహానికి జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయకులు వెనిగండ్ల రామకృష్ణ, బీసీ సంఘాల నాయకులు, కూటమి నేతలు నివాళులర్పించారు. టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, పంద్రాజు సాంబ శివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ రవి కుమార్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు పాల్గొన్నారు.


అవనిగడ్డలో నివాళులర్పిస్తున్న నాయకులు

పలుచోట్ల కార్తీక వనసమారాధనలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఏజీఅండ్‌ఎస్ఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ సేవాకార్యక్రమాలు అభినందనీ యమని సిద్దార్థా అకాడమి సభ్యుడు, కళాశాల కన్వీనర్ తాతినేని శ్రీహరిరావు అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించన కార్తీక వనసమారాధన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. అనంతరం కళాశాల విద్యార్థినుల కోలాట ం, చిన్నారులు సాంస్కతిక కార్యక్రమాలు నృత్యాలు ఆకట్టుకున్నాయి. వాకర్స్ జిల్లా గవర్నర్ సనకా సుబ్బారావు, ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రావి కష్ణారావు, కళాశాల ప్రిన్సిపాల్ శివనాథ్, ఉయ్యూరు సీఐ రామారావు, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సాంబశివరావు, అధ్యక్ష కార్యదర్శులు సత్తార్, పూర్ణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** మండలంలోని చిన్నఅవుటపల్లి శివారు తోటలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన ఉత్సవం ఉత్సాహపూర్వకంగా జరిగింది. అనంతరం మహిళా వాకర్స్, పిల్లల కోసం మ్యూజికల్ చైర్స్, అంత్యాక్షరి, క్విజ్ వంటి వినోదాత్మక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు, వాకర్స్ అసోసియేషన్ వారి చేతుల మీదుగా కాబోయే జిల్లా గవర్నర్ లోయ ఈశ్వరరావు బహుమతులు అందజేశారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు టీ. సీతారామ్, కేఎస్. జగదేశ్వరరావు మరియు పాలిటెక్నిక్ కళాశాల రిటైర్డ్ ఏవో కనగాల వెంకటేశ్వరరావు ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కేవీఆర్. కిషోర్ , కార్యదర్శి ఎస్. శ్రీనివాసరావు , న్యాయవాది తిరివీధి వెంకయ్య పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ :** వన సమారాధనలు వసుదైక కుటుంబానికి సోపానాలని ఉమ్మడి కృష్ణా జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గాంధీ విద్యాలయంలో జరిగిన యాదవ వన సమారాధన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యాదవ సంఘం నాయకులు గోకుల్ శివ, నాగబోయిన రవి, జనసేన పార్టీ నగరఅధ్యక్షులు గడ్డంరాజు, డిసి వైస్ చైర్మన్ శాయన శివయ్య, జనసేన పార్టీ యూత్ అధ్యక్షులు కూనపురెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఉయ్యూరులో...


బందరులో బండి రామకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు మండలం, గోసాల గ్రామంలోని ఓ పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తిని, వాహనం ఢీకొనగా అతను సంఘటన స్థలంలోని మృతి చెందాడు. మృతునికి సుమారు 65 సంవత్సరాలు ఉంటాయని, తెల్ల చుక్కల గళ్ళ లుంగి వేసుకుని ఉన్నాడని, మృతుని వివరాలు వాహన వివరాలు గురించి దర్యాప్తు చేస్తున్నట్టు పెనమలూరు పోలీసులు తెలిపారు.

అవయవదానం


విజయ్ కుమార్ (ఫైల్)

ప్రజాశక్తి - గుడివాడ : అవయవ దానం ద్వారా నలుగురు జీవితాల్లో చిరు వ్యాపారి వెలుగులు నింపి సజీవంగా నిలిచారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులోని పెద్ద మసీదు వద్ద నివసించే చిరు వ్యాపారి, హరి విజయ్‌కుమార్ (46) బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు ఆయన అవయవాలను దానమిచ్చి ఆదర్శంగా నిలిచారు. మూత్రపిండం, కాలేయం మణిపాల్ వైద్యశాలకు అందజేయగా విజయవాడలో అవసరమైన వారికి అవయవ మార్పిడి నిర్వహించారు. మరో కిడ్నీ విజయవాడ కామినేని హాస్పటల్‌కు, నేత్రాలు ఎల్వీ ప్రసాద్ ఐ ఆసుపత్రికి తరలించారు. హరి విజయ్ కుమార్ అక్టోబర్ 30న గుడివాడ నుంచి బ్యాంకు పని నిమిత్తం మంగళగిరి వచ్చారు. ఈ క్రమంలో ఆకస్మికంగా ఫిట్స్ రావడంతో స్థానిక వైద్యశాలకు తరలించారు. బ్రెయిన్‌లో తీవ్ర రక్తస్రావం అయ్యిందని గుర్తించి, మెరుగైన వైద్యం కోసం మణిపాల్ వైద్యశాలకు తరలించగా బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. ఈ నేపథ్యంలో భార్య యోగావిష్ణు ప్రియ, కుటుంబ సభ్యుల అంగీకారంతో ఏపీ జీవన్ దాన్ చైర్మన్ డాక్టర్ రాంబాబు, మణి పాల్ వైద్యశాల డైరెక్టర్ రామాంజనేయరెడ్డి పర్యవేక్షణలో అవయవదానం చేశారు. మరణించిన తర్వాత కూడా నలుగురు జీవితాల్లో వెలుగులు నింపిన విజయ్ కుమార్ కుటుంబ సభ్యులను గుడివాడకు చెందిన పలువురు సేవా తత్పరులు అభినందించారు.

కోటయ్య కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి-ఘంటసాల : విద్యుత్ ప్రమాదంలో మరణించిన ఘంటసాల మండలం లంకపల్లి గ్రామానికి చెందిన రైతు కుంపటి కోటయ్య (49) కుటుంబానికి న్యాయం చేయాలని సిపిఎం కష్ణా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శీలం నారాయణరావు, ఘంటసాల మండల కార్యదర్శి మేడంకి వెంకటేశ్వరరావులు కోరారు. మొంథా తుఫాన్ కారణంగా తెగిపోయిన విద్యుత్ వైర్లను గుర్తించలేక, వాటిని తాకడంతో కోటయ్య అకస్మాత్తుగా కరెంట్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయినా సంఘటన అక్టోబర్ 31న జరిగింది. కోటయ్య మూగ, చెవిటి వికలాంగుడు. లంకపల్లి-మాజేరు డొంక సమీపంలోని తన పొలం చూసుకుని తిరిగి ఇంటికి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ప్రభుత్వం స్పందించి ప్రకృతి వైపరీత్యాల నిధి నుండి కోటయ్య కుటుంబానికి కనీసం రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని, బాధ్యులపై విచారణ జరిపి నిర్ల క్ష్యంపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాని వారు డిమాండ్ చేశారు.

జోగి రమేష్ అరెస్టు అన్యాయం

ప్రజాశక్తి-కంకిపాడు : జోగి రమేష్ అరెస్టు అక్రమమని వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ పెనమలూరు నియోజకవర్గ బిసి విభాగ అధ్యక్షులు మండూరి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కాశీబుగ్గ ఘటన పక్కదారి పట్టించడానికి ప్రభుత్వం చేస్తున్న కుటిల రాజకీయ మన్నారు. ఇది కేవలం కక్ష సాధింపు చర్య, కల్తీ మద్యం కేసులో జోగిరమేష్‌ను దురుద్దేశంతోనే ఇరికించారన్నారు. కల్తీ మద్యం తయారుచేస్తూ టీడీపీ నాయకులు అడ్డంగా దొరికిపోవడంతో, ఆ బురదను వైయస్సార్‌సీపీకి అంటించే కుట్ర చేస్తున్నారన్నారు.

8న ఇళయరాజా సంగీత కచేరీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్రంలో మొదటిసారిగా ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా మ్యూజికల్ కన్సర్ట్ విజయవాడలో జరగనుంది. ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియం వేదికగా ఈ నెల 8వ తేదీన సాయంత్రం ఈ కార్యక్రమం నిర్వహించను న్నారు. ట్రెండ్ సెట్టర్ ఈవెంట్స్ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కచేరీకి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తోంది. రాజధాని అమరావతికి సమీపంలో ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమని, నగర ఖ్యాతిని మరింత పెంచేందుకు ఇది దోహదపడుతుందని సంస్థ ఆర్గనైజర్ పద్మనాభుని సుధాకర్ తెలిపారు. ఇళయరాజాతో కలిసి ఎస్పీ చరణ్, హరిచరణ్, మధుబాలకృష్ణన్, జితేంద్ రాజ్‌తోపాటు మరో 10 మంది ప్రముఖ గాయకులు పాల్గొంటారు. 70 మంది సంగీతకారుల బృందం సహకారంతో సంగీత ప్రియులకు ఆహ్లాదకరమైన అనుభవం అందనుంది. నగరంలో ఇళయరాజా కటౌట్‌ను ఏర్పాటు చేసి, కళాకారులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సింగర్స్ సాయి సిద్ధార్థ, కళ్యాణి, ఈశ్వర్, కిషోర్, సత్య, పుణ్యశీల తదితరులు పాల్గొన్నారు.



దుర్గ గుడి అభివృద్ధికి కృషి చేస్తా

- నూతన చైర్మన్ బొర్రా రాధ కృష్ణ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : దుర్గమ్మ గుడిని అభివృద్ధి చేసేందుకు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే సుజనా చౌదరి, దేవాదాయ శాఖ అధికారులందరి సమన్వ యంతో కలిసి పని చేస్తానని దుర్గమ్మ గుడి నూతన చైర్మన్ బొర్రా రాధ కృష్ణ (గాంధీ) అన్నారు. ఇటీవల దుర్గమ్మ గుడి నూతన చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఫతావుల్లా ఆధ్వర్యంలో 54వ డివిజన్‌లోని ఎంపి కేశినేని శివనాథ్ కార్యాలయంలో సన్మాన సభను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, టీడీపీ తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, దుర్గమ్మ గుడి పాలక మండలి సభ్యురాలు శుకాసి సరిత, ఏఎంసీ మార్కెట్ వైస్ చైర్మన్ పాల మాధవ్, పశ్చిమ తెలుగు యువత ప్రెసిడెంట్ మాధవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొర్రా రాధ కృష్ణ భక్తుల సౌకర్యాలే కేంద్రంగా, అమ్మవారి ఆలయాన్ని పూర్తిగా అభివృద్ధి చేసేలా అందరితో కలిసి పనిచేస్తానన్నారు.



గౌరవ అధ్యక్షునిగా డూండి రాకేష్

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్‌ను నియమించారు. ఈ పదవిలో డూండి రాకేష్ 3 సంవత్సరాలపాటు (2025-28) కొనసాగుతారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ న్యూఢిల్లీ, అడ్వైసరీ బోర్డ్ సెంట్రల్ కమిటీ చైర్మన్ గంజి రాజ్యమౌళి గుప్తా, ఐవిఎఫ్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస గుప్తా చేతుల మీదుగా డూండీ రాకేష్‌కు నియామక పత్రం అందుకున్నారు. ఆర్యవైశ్యులలో గొప్ప వ్యక్తులకు వరించే ఈ పదవి తనకు వరించినందుకు డూండి రాకేష్ ఈ సందర్భంగా హర్షం వ్యక్తపరిచారు. కార్యక్రమంలో నూతనంగా నియమితమైన రాష్ట్ర అధ్యక్షులు కోనా శ్రీనివాస్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ గుంట్ల రామ్మోహన్, ప్రముఖ ఆర్యవైశ్య నేతలు పాల్గొన్నారు.



ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నదే లక్ష్యం

- ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్, రమణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : హెల్త్ కార్డులపై ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందే విధంగా కృషి చేయటమే ఎన్‌జిఒ సంఘం లక్ష్యమని, హెల్త్ కార్డులు పూర్తి స్థాయిలో పనిచేయటం లేదని, నగదు రహిత వైద్య సేవలు ఉద్యోగులకు అందించేందుకు హాస్పిటల్స్ నిరాకరిస్తున్నాయని, మెడికల్ రీయింబర్స్మెంట్ కోసం ఉద్యోగులు పెట్టుకున్న బిల్లులు ఏళ్ల తరబడి స్క్రూటినీలోనే మగ్గుతున్నాయని ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ అన్నారు. విజయవాడ గాంధీనగర్ ఎన్జీజీవో హోంలో ఆదివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ఉద్యోగుల వైద్య సేవలు, ఇతర సమస్యలపై మాట్లాడారు. ఉద్యోగులకు సంబంధించి వైద్య సేవలలో ఉన్న సమస్యలు, పాత ప్యాకేజీ రేట్లు వల్ల ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, దశాబ్ద కాలం క్రితం నిర్ణయించిన రూ.2 లక్షలు సీలింగు వంటి అంశాలు ఉద్యోగుల పాలిట శాపంగా మారాయని, వీటన్నింటిని సరి చేస్తూ ఇన్సూరెన్స్ కింద హెల్త్ కార్డు సేవలను తేవాలనే లక్ష్యంతో ఏపీ ఎన్జీజీవో సంఘం పనిచేస్తుందని తెలిపారు. దానికి అనుగుణంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు కమిటీని నియామకం చేసి 60 రోజుల్లో వీటన్నిటిమీద పరిష్కారానికి మార్గం సుగమం చేయాలని కోరారు. రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను, ఎన్జీవో 75 సంవత్సరాల వేడుకలను నిర్వహించాలని రాష్ట్ర కార్యవర్గం తీర్మానం చేసింది. రాష్ట్ర సంఘ కోశాధికారిగా పిఐఓ డిపార్టుమెంట్ చెందిన భారతి ప్రసాద్‌ను కార్యవర్గం ఏకగీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో 26 జిల్లాలకు సంబంధించిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



పంచారామాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - తిరువూరు : కార్తీక మాసం సందర్భంగా అన్నవరం, శ్రీశైలం, ప్రసిద్ధ పంచారామాలైన అమరావతి, భీమవరం పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట పుణ్యక్షేత్రాలకు తిరువూరు డిపో నుంచి ప్రతి శని, ఆదివారాలలో ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఇన్‌ఛార్జ్ డిపో మేనేజర్ నాగ మల్లేశ్వరరావు తెలిపారు. తిరువూరు నుండి అన్నవరం క్షేత్రానికి సాయంత్రం 6 గంటలకు, శ్రీశైల క్షేత్రానికి సాయంత్రం 7 గంటలకు, పంచారామాలకు రాత్రి 10 గంటలకు ఈ నెల 3వ తేదీ నుండి ఈ ప్రత్యేక బస్సులు బయల్దేరు తాయని చెప్పారు. ఈ సదవకాశాన్ని తిరువూరు పరిసర ప్రాంత ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు. టికెట్లు కావలసినవారు ఆన్లైన్లో గాని, ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్లను బుక్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 7382487969, 9885661835 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ రచ్చబండ, సంతకాల సేకరణ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విజయవాడ పశ్చిమలోని 41వ డివిజన్ భవానీపురంలోని దర్గా వద్ద స్థానిక డివిజన్ కార్పొరేటర్ ఎండి ఇర్ఫాన్, క్లస్టర్ ఇంచార్జ్ కేసరి కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని ముందుగా వైయస్ఆర్ విగ్రహానికి నివాళు లర్పించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఆవశ్యకతను ప్రజలకు వివరించి, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ సొంత వ్యక్తుల లాభాపేక్ష కోసమే చంద్రబాబు మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేస్తున్నారని ఆరోపించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిలిపివేయాలని, లేనిపక్షంలో పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



రెరా చైర్మన్ శివారెడ్డికి క్రెడాయ్ అభినందన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిచ్చేలా ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (ఏపీ రేరా) చైర్మన్‌గా సేవలందించగలిగే సమర్థులు ఆరె శివారెడ్డి అని క్రెడాయ్ కొనియాడింది. ఏపీ రేరా చైర్మన్‌గా నియమితులైన ఆరె శివారెడ్డికి ఆదివారం భారతి నగర్, విజయవాడ కార్యాలయంలో క్రెడాయ్ విజయవాడ చాప్టర్ సన్మాన అభినందన కార్యక్రమం నిర్వహించింది. శివారెడ్డి అమరావతి పరిరక్షణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని క్రెడాయ్ విజయవాడ చాప్టర్ చైర్మన్ సి.సతీష్ బాబు, అధ్యక్షుడు జి.ఎస్.ఆర్. మోహన్‌రావు, జనరల్ సెక్రటరీ కే.రఘురామ్, కోశాధికారి జి.సత్యసాయిరాం గుర్తు చేశారు. అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా, జేఏసీ సమన్వయకర్తగా పలు నిరసనలు, ఆందోళనలు చేపట్టారని వివరించారు. ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద రాజధాని రైతులతో కలిసి ధర్నా నిర్వహించి ఉద్యమాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. విజయవాడలో కన్‌స్ట్రక్షన్ సంస్థను స్థాపించి నిర్మాణ రంగంలో విజయవంతంగా కొనసాగుతున్నారన్నారు. ఆయన నాయకత్వంలో ఎపి రెరా మరింత పారదర్శకంగా, ఉన్నతంగా పని చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాల్లో రియల్ ఎస్టేట్ రంగానికి అపార అవకాశాలు ఉన్నాయని, రెరా సహకారంతో మరిన్ని పెట్టుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



విజయవంతంగా 'వైద్య విద్యా కార్యక్రమం'

- డాక్టర్ పోతినేని రమేష్ బాబుకు సత్కారం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో గుడివాడ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐ.ఎం.ఏ) నిరంతర వైద్య విద్యా కార్యక్రమాన్ని (సీఎంఈ) ఐ.ఎం.ఏ హాల్‌లో ఆదివారం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గుడివాడ పరిసర ప్రాంతాల నుండి 200 మంది వైద్యులు పాల్గొని, ఆధునిక వైద్య సాంకేతికతలు, గుండె జబ్బుల చికిత్సలో వచ్చిన తాజా పురోగతుల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం వైద్యులకు తమ ప్రొఫెషనల్ నైపుణ్యాలను, మెరుగుపరచు కోవడానికి రోగులకు మరింత బాధ్యతాయుతమైన చికిత్సలు అందించడానికి ఒక ముఖ్యమైన అవకాశంగా నిలిచింది. తొలుత ఈ కార్యక్రమాన్ని ఐ.ఎం.ఎ ప్రెసిడెంట్ డాక్టర్ మాగంటి శ్రీనివాస్, సెక్రటరీ డాక్టర్ పునుకొల్లు శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్ డాక్టర్ దుర్గా ప్రసాద్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ స్పెషాలిటీల వైద్య నిపుణులు పాల్గొని, తమ అనుభవాలు, తాజా పరిశోధనలు గురించి చర్చించారు. చిన్న పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కత్తుల అనూష, మెడికల్ అండ్ సర్జికల్ అంకాలజిస్టులు డాక్టర్ సింధు, డాక్టర్ ఫణి రాజ్ కుమార్, ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ గోపాల దత్త, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టులు డాక్టర్ స్వరాజ్యం, డాక్టర్ మధు కృష్ణ, డాక్టర్ వెంకటేష్ రెడ్డి, కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ శివ ప్రసాద్, న్యూరాలజిస్టులు డాక్టర్ హరిణి, డాక్టర్ రాజేష్, న్యూరో సర్జన్ డాక్టర్ పృథ్వి, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వై.రమేష్, పల్మనాలజిస్ట్ డాక్టర్ ఎన్.బాలకృష్ణ, రుమటాలజిస్ట్ డాక్టర్ మమత, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ జె. కార్తికేయ, ఇంటెన్సివ్ కేర్ యూనిట్ మేనేజ్‌మెంట్ నిపుణులు తమ సెషన్‌ల ద్వారా వైద్యులకు ప్రాక్టికల్ టిప్స్ కేస్ స్టడీలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్ హాస్పిటల్స్ చీఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్ బాబును ఘనంగా సత్కరించారు .



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

విజయవాడ సిటీ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రౌడీ షీటర్లను విజయవాడ వెస్ట్ ఎసిపి ఎన్ దుర్గరావు హెచ్చరించారు. వన్‌టౌన్, టూటౌన్ పిఎస్‌ల పరిధిలోని రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతి ఆదివారం తప్పనిసరిగా స్టేషన్‌కు హాజరు కావాలని ఆదేశించారు. నేర వృత్తి మానుకోని సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లకు సూచించారు. కౌన్సిలింగ్‌లో వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి గురు ప్రకాష్, టూ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ కొండలరావు, పాల్గొన్నారు. **తిరువూరు :** తిరువూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఎస్ఐ సత్యనారాయణ కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రతి ఆదివారం తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి కనబడాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి అల్లర్లు సృష్టించే వారిపై కఠినమైన సెక్షన్లతో కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ 2 కృష్ణా రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** పట్టణ పోలీస్ స్టేషన్‌లో జగ్గయ్యపేట, చిలకల్లు పోలీస్ స్టేషన్ల పరిధిలోని చెడు నడత కలిగిన పాత నేరస్తులకు ఆదివారం జగ్గయ్యపేట సిఐ పి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. చెడు ప్రవర్తన మానుకొని సత్ప్రవర్తనతో మెలగాలని, అశాంతి, సంఘ విద్రోహ చర్యలకు పాల్పడవద్దని, పద్ధతి మార్చుకోని వారిని ఉపేక్షించేది లేదని సిఐ హెచ్చరించారు. కౌన్సెలింగ్‌లో జగ్గయ్యపేట, చిల్లకల్లు ఎస్ఐలు రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు



మాట్లాడుతున్న కె. ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం): సమస్యల పరిష్కారానికి పోరాటమే ఏకైక మార్గమని ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు అన్నారు. కృష్ణా జిల్లా పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ 9వ మహాసభ గన్నవరంలోని చింతపల్లి పాపారావు భవన ప్రాంగణంలో ఆదివారం గన్నవరం మండల అధ్యక్షులు మామిడి గణేష్, కె శ్రీనివాసరావుల అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయతీ కార్మికులు నిరంతరం సమస్యలతో సహజీవనం చేస్తున్నారని, ఈ విషయంపై ప్రభుత్వానికి చెబితే వేతనాలు పెంచడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చిన పాలకులు అమలు జరిపే విషయంలో కార్మికులను మోసం చేస్తోందని విమర్శించారు. గత 15 మాసాల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల జీతాలు పెంచకుండా ఆగస్టు 15, గాంధీ జయంతి రోజున కార్మికుల కాళ్లు కడిగి, వారు దేవుళ్లతో సమానమని చెప్పి సమస్యను దాటవేస్తున్నారని అన్నారు. ఇది చాలదు అన్నట్లుగా దీనికి తోడు, గ్రామాల్లో కార్మికులపై దాడులు చేయడం అనివార్యంగా మారుతుందని అన్నారు. ఇలాంటి దాడుల నుండి రక్షించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమే కాకుండా, కనీసం ఈఎస్ఐ, పిఎఫ్ లాంటి కనీస సౌకర్యాలు కూడా అమలు చేయడం లేదని ఆయన విమర్శించారు. ఇలాంటి పరిస్థితిలో కార్మికులకు పోరాటమే మార్గం అని అన్నారు. తొలుత మహాసభ ప్రారంభ సూచకంగా సిఐటియు పతాకాన్ని నాగమణి ఎగరవేశారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ పూల మాల వేశారు. జిల్లా కార్యదర్శి ఎం. పోలినాయుడు గత మూడు సంవత్సరాల కార్యకలాపాల నివేదిక ప్రవేశ పెట్టగా నివేదికపై చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బి. తాతబ్బాయి, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘం గన్నవరం మండల కార్యదర్శులు సూరగాని సాంబశివరావు, కైలే ఏసుదాసు, మల్లంపల్లి ఆంజనేయులు, ఉంగుటూరు సిఐటియు కన్వీనర్ కె. రామరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక : నూతన కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే శ్రీనివాసరావు ఎం పోల్ నాయుడు, ఆఫీస్ బేరర్స్ గా ఎం గణేష్, పి కష్ణకుమారి, ఎం ప్రభు శేఖర్, టి అబ్రహం, కే రాజేష్, వి శ్రీనివాసరావు, ఎం జగన్, ఎం రామకష్ణ, కో ఆప్షన్ మరో 18 మందితో జిల్లా కమిటీ సభ్యులతో కలిపి మొత్తం 29 మందితో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టుల్లో పెండింగ్లో ఉన్న కేసులు పరిష్కారానికి వచ్చే డిసెంబర్ నెల 13 వ తేదీన రెండవ శనివారం జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి గుర్రాల గోపి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పూర్వపు ఉమ్మడి కష్ణా జిల్లాలోని అన్ని న్యాయస్థానాల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామ న్నారు. ఈ సందర్భంగా సివిల్, కాంపౌండబుల్, క్రిమినల్ కేసుల తో పాటు అన్ని రకాల కేసులు పరిష్కరిస్తామన్నారు. కావున ఈ అవకాశాన్ని కక్షిదారులందరూ సద్వినియోగం చేసు కోవాలన్నారు.



సుబ్రహ్మణ్యేశ్వరుని సన్నిధిలో జడ్జిలు



ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలోఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న పాట్నా హైకోర్టు జడ్జి జి. అనుపమ చక్రవర్తి దర్శించుకున్నారు. దేవస్థానానికి విచ్చేసిన అనుపమ చక్రవర్తి కుటుంబ సభ్యులకు ఆలయ సూపర్డెంట్ అచ్యుత మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో, ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు కుటుంబ సమేతంగా ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం ఆలయ అధికారులు జడ్జిని ఆలయ మర్యాదలతో సత్కరించి, స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని సన్నిధిలో హైకోర్టు జడ్జి : అలాగే సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని హైకోర్టు జడ్జి వై. లక్ష్మణరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారు ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. జడ్జిని ఆలయ సూపర్డెంట్ అచ్యుత మధుసూదన్‌రావు ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.అలాగే సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఏలూరు ఆడిట్ విభాగం (మూడు జోన్లు) ప్రాంతీయ ఉప సంచా లకులు బి. ఆర్. క్రాంతి కుమారి దర్శించుకున్నారు. దేవస్థానానికి విచ్చేసిన ఆమెకు ఆలయ సూపర్డెంట్ అచ్యుత మధుసూదన్ రావు ఆధ్వర్యంలో, స్వాగతం పలికి పూజల అనంతరం స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. వీరి వెంట జిల్లా ఆడిట్ అధికారి వై. సూర్య భాస్కర్ ఉన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి-అవనిగడ్డ : విపత్తుల వేళ ధైర్యసాహసాలతో పనిచేసిన ప్రతి ఒక్కరూ స్ఫూర్తిదాయకులని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ప్రశంసించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా సీఎం క్యాంప్ కార్యాలయంలో మొంథా తుఫాన్ యోధావాదులు అందుకున్న కోడూరు తాసిల్దార్ జలగం సౌజన్య కిరణ్మయి, అవనిగడ్డ గ్రామ సచివాలయం-5 ఫిషరీస్ అసిస్టెంట్ లేబాక నాగేంద్రబాబులను ఆదివారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, నియోజకవర్గ యువ నాయకులు మండల వెంకట్రామ్ ఘనంగా సత్కరించారు. .

జమీగొల్వేపల్లి రోడ్డు గుంతలమయం



గుంతలమయంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి-పామర్రు : మండల పరిధిలోని జమీగొల్వేపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి గోతులతో శిథిలమై వచ్చే పోయే వారికి తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ గ్రామం పామర్రు- గుడివాడ జాతీయ రహదారి నుండి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. గ్రామంలోకి వెళ్లాలంటే మూడు కిలోమీటర్లు దూరం గోతుల్లోనూ కంకర రాళ్ల మధ్య ప్రయాణం చేయాలి. వర్షం వచ్చినప్పుడు పరిస్థితి మరీ ఘోరంగా ఉంటుంది. వర్షం నీటితో గోతులు నిండి దారి తెలియక మరీ ప్రమాదకరంగా ఉంటుంది. ద్విచక్ర వాహనదారులు సైతం ఈ రోడ్డుపై వెళ్లే పరిస్థితి లేదు. వాహనం మీద బరువులు ఉన్న లేక ఇద్దరు ముగ్గురు వ్యక్తులు ఉన్న జారి పడటం ఖాయం. రైతులు ధాన్యం చేలలోనుండి ఇళ్లకి, గ్రామంలో నుండి బయటకు తోలుకోవాలంటే ఈ రహదారిలో తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్ బి శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఈ రోడ్డును వెంటనే బాగుచేయాలని సంబంధిత అధికారులను ప్రజాప్రతినిధులను గ్రామస్తులు కోరుతున్నారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-నాగాయలంక : నాగాయలంక మండలంలో మొంథా ఇబ్బందులు పడ్డ స్వర్ణగొంది గ్రామస్తులకు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉచిత బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. ఆదివారం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు చేతుల మీదుగా బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని విధాలుగా తోడుగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, పార్టీ నాయకులు కొల్లాటి ధనుంజయ్, కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, నాయుడు రామయ్య, పర్చూ రి. దుర్గాప్రసాద్ ,బం డే రాఘవ, మేడికొండ విజయ్, మంచాల మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై ఆందోళన వద్దు : వర్ల



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మొంథా తుఫాను ప్రభావంతో ఇటీవల కురిసిన భారీవర్షాలకు నీటమునిగి పంట నష్టపోయిన రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని, రైతుల నుంచి మొత్తం ధాన్యం కొనుగోలు చేస్తామని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా భరోసా ఇచ్చారు. ఆదివారం ఆయన దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కొంతమంది చేస్తున్న విషప్రచారం రైతులను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. ఆరుగాలం చమటోడ్చి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుందని, మద్దతు ధర ప్రకారం, ప్రభుత్వం నిర్ధేశించిన నిబంధనల మేరకు ప్రభుత్వపరంగా ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

692 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో ఆదివారం ఉచిత కార్పోరేట్ వైద్య పరీక్షలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 692మంది రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ వెంకట్రావు, గుండె, ఊపిరి తిత్తులు తదితర సంబంధ వ్యాధులకు విజయవాడ కామినేని హాస్పటల్ వైద్యులు ఎస్.దాశరథి, డాక్టర్ భవాని, నేత్ర వైద్యానికి విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ హనుమకొండ దుర్గాభవాని, మానసిక రుగ్మతలకు హైదరాబాదుకు చెందిన డాక్టర్ హరిహర్ తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం ఉచిత మందులను పంపిణీ చేశారు.



న్యాయకళాశాల విద్యార్థుల శ్రమదానం

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడులో నేషనల్ సోషల్ స్కీమ్-ఎన్ఎస్ఎస్‌లో భాగంగా వెలగపూడి దుర్గాంబ సిద్ధార్థ న్యాయకళాశాల విద్యార్థులు కంకిపాడు గవర్నమెంట్ హాస్పిటల్‌లో ఆదివారం శ్రమదానం నిర్వహించారు. తుమ్మలపల్లి పరమేశ్వరావు ట్రస్టు తరుపున తుమ్మలపల్లి హరికష్ణ భోజనవసతులు, స్నాక్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం పాండురంగ, నిర్వాహకుడు యర్రపోతు రామకష్ణ, జనసేన నాయకులు బోయిన నాగరాజు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చిట్టూరి నాగేశ్వరావు సీనియర్ నాయకులు అన్నే రామారావు, తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇంచార్జి కాకుమాను రమేష్, హాస్పిటల్ చైర్ పర్సన్ బోయిన రోహిణి కుమారి, పిఎసిఎస్ చైర్మన్ సుంకర శివ పాల్గొన్నారు.



అవనిగడ్డలో స్వచ్ఛభారత్‌ను తిరిగి ప్రారంభించాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : గతంలో దివిసీమలోని అనేక గ్రామాల్లో చల్లపల్లి ని ఆదర్శంగా తీసుకొని రాజకీయాలు, కులమతాలకు అతీతంగా ప్రతిరోజు ఒక ఉద్యమంగా నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాలని వైసీపీ యువనేత బడే గౌతం విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో స్వచ్ఛ అవనిగడ్డ పేరుతో అవనిగడ్డలో స్వచ్ఛత కోసం ప్రభుత్వం వద్ద నుండి ఎలాంటి సహాయం అందకపోయినా స్వచ్ఛ అవనిగడ్డ కార్యకర్తలే వారి సొంత ఖర్చులతో కార్యక్రమాలు నిర్వహించగా, నాడు స్వచ్ఛ అవనిగడ్డ కార్యక్రమాలలో తమ కుటుంబ సభ్యులతో పాటు తాను కూడా కొన్ని సందర్భాల్లో పాల్గొన్నందుకు గర్వంగా ఉందని గౌతమ్ తెలిపారు. మళ్లీ దివిసీమలోని అన్ని గ్రామాలలో ముందుగా అవనిగడ్డలో రాజకీయాలకు అతీతంగా సంబంధిత ప్రభుత్వ వ్యవస్థలను సమన్వయపరుస్తూ స్వచ్ఛ ఆవనిగడ్డ కార్యక్రమం తిరిగి కొనసాగించే విధంగా ఎమ్మెల్యే చొరవ చూపాలని కోరారు.

స్తంభం విరిగిపడి అన్నాచెల్లెలు మృతి

ప్రజాశక్తి- నందిగామ : విద్యుత్ స్తంభం విరిగిపడటంతో అన్నాచెల్లెల్లు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన నందిగామ హిందూ స్మశాన వాటికలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామలోని బీసీ కాలనీకి ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందడంతో అతని దహన సంస్కారాలు నిర్వహించేందుకు అదే కాలనీకి చెందిన మృతుని బంధువులు, స్థానికులు స్మశాన వాటికకు వెళ్లారు. అక్కడ చెట్లు నరుకుతుండడంతో ఓ చెట్టు విద్యుత్ స్తంభంపై పడింది. దీంతో స్తంభం విరిగి అంత్యక్రియల్లో పాల్గొన్న తాపీమేస్త్రీ తమ్మిశెట్టి రాజు (57) మృతి చెందారు. రాజు చెల్లెలు వేముల కాంచన తీవ్రంగా గాయపడి విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలు కావడంతో నందిగామ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే రాజు, కాంచన మృతికి చెట్టు నరికిన ఇద్దరు వ్యక్తులు కారణమంటూ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం మతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జోగి వ్యాఖ్యలు అర్థరహితం : టిడిపి



ప్రజాశక్తి-మైలవరం : అక్రమ మద్యం కేసులో ఆధారాలతో దొరికిపోయి డైవర్షన్ పాలిటిక్స్ అంటూ చంద్రబాబు, లోకేష్, వసంతలపై జోగి రమేష్ చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు తగవని పలువురు టిడిపి నాయకులు పేర్కొన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో వారు మాట్లాడుతూ కల్తీ మద్యం వ్యవహారంలో ప్రధాన నిందితుడే జోగి రమేష్ పేరు ప్రస్తావించారని, దొంగ ప్రమాణాలు చేస్తే ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. నా బిసిలు, నా ఎస్‌సిలు, నా మైనార్టీలు అంటూ జోగి రమేష్ అనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కులాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయటం జోగి రమేష్‌కు తగదని హితవు పలికారు.

జిల్లా స్థాయి ఆటల పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ప్రజాశక్తి-వత్సవాయి : నందిగామ డివిజన్ స్థాయిలో చిల్లకల్లులో నిర్వహించిన కోకో, కబడ్డీ పోటీల్లో వత్సవాయికి చెందిన నలుగురు క్రీడాకారులు విశేష ప్రతిభను ప్రదర్శించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వత్సవాయి జడ్పీ పాఠశాల పిడి మార్కపూడి బాబురావు తెలిపారు. అండర్ 14 విభాగంలో కోకోలో ఎస్.కె అమిద్, శ్రీకాంత్ ఎంపిక కాగా, అండర్ 17 విభాగంలో రోహిత్, అక్బర్ ఎంపికయ్యారు. క్రీడాకారులకు గొలుసు సామ్రాజ్యం, హెచ్‌ఎం ఎన్.అనిత శ్రీ, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి అభినందించారు.

జోగి రమేష్ అక్రమ అరెస్టుకు ఖండన

ప్రజాశక్తి -వత్సవాయి : నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి, బిసి నేత జోగి రమేష్‌ను కూటమి సర్కార్ కక్షపూరితంగా వ్యవహరించి అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైసిపి బిసి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు తెలిపారు. పెనుగంచిప్రోలులోని ఆ పార్టీ గ్రామ అధ్యక్షులు గుడిమెట్ల శంకర్ నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జోగి రమేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి కనకదుర్గమ్మ ఆలయంలో ఏ తప్పు చేయలేదని ప్రమాణం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నకిలీ మద్యం కేసులో కీలక సూత్రదారులను వదిలిపెట్టి జోగి రమేష్‌ను అన్యాయంగా చేస్తున్నారని తెలిపారు.

వైద్య కళాశాలలను ప్రైవేటీకరించొద్దు : సిపిఎం



ప్రజాశక్తి - రెడ్డిగూడెం : టిడిపి కూటమి ప్రభుత్వం పేదలకు వైద్య విద్యను దూరం చేసేందుకే ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరిస్తోందని సిపిఎం మండల కమిటీ తెలిపింది. రెడ్డిగూడెం సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ మండల కమిటీ సమావేశం సిహెచ్ విజయకుమార్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో పెట్టుబడిదారులకు, ప్రజాస్వామ్యానికి మధ్య పోరాటం జరుగుతుందని తెలిపారు. ఈ నెల ఏడో తేదీన విజయవాడలో ప్రజాస్వామ్య బలాన్ని తెలియజేసేందుకు పెద్ద ఎత్తున రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు నిర్వహిస్తున్నారని తెలిపారు. కవాతును విజయవంతం చేసేందుకు ప్రజలు తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను సిపిఎం మండల కమిటీ ఆమోదించింది. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ఇళ్ల నిర్మించాలని, వైద్య కళాశాలలు ప్రైవేటు పరం చేయకుండా ఆపాలి అనే తీర్మానాలను సిపిఎం మండల కమిటీ ఆమోదించింది. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు యం మాధవరెడ్డి, కష్ణారెడ్డి, కాంతారావు, రాజు, వెంకటేశ్వర్రావు, అప్పిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పేకాట రాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి-వత్సవాయి : పేకాట ఆడుతున్న ఏడుగురిని ఆరెస్టు చేసిన సంఘటన మండల కేంద్రమైన వత్సవాయిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వత్సవాయిలో శివారు గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.24 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లపై నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



నిరాశ్రయులకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి- నందిగామ : చింతలపాడు గ్రామంలో నిరాశ్రయులైన 50 కుటుంబాలకు డోలాస్ ఫ్యామిలీ ట్రస్ట్ చైర్మన్ పగిడిపల్లి దేవసహాయం ఆధ్వర్యంలో ఆదివారం బియ్యం పంపిణీ చేశారు. పల్లపు ప్రాంతాల్లో నిరాశ్రయులైన వారికి గత ఐదు రోజులుగా బియ్యం పంపిణీ జరుగుతుంది. కంచికచర్ల, మాగల్లు, కొనాయి పాలెం, నందిగామ తదితర ప్రాంతాల్లోనూ బియ్యం పంపిణీ చేస్తున్నామని, అవసరమైన వారు తమను సంప్రదించాలని ట్రస్ట్ చైర్మన్ పగిడిపల్లి దేవ సహాయం అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అడ్మినిస్ట్రేటివ్ పి. రత్న వినోద్, వర కుమార్, సంగయ్య, మున్నా తదితరులు పాల్గొన్నారు.

7న కవాతును జయప్రదం చేయాలి



ప్రజాశక్తి-వీరులపాడు : ఈ నెల 7న విజయవాడలో జరిగే రెడ్ వాలంటీర్ల కవాతును జయప్రదం చేయాలని కోరుతూ వీరులపాడు మండలంలో ఆదివారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కోట కళ్యాణ్ మాట్లాడుతూ.. విజయవాడలో రెడ్ వాలంటీర్ల ర్యాలీ నిర్వహిస్తున్నారని, ఈ ర్యాలీ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం నుండి రాఘవయ్య పార్క్ వద్ద ఉన్న మాకినేని బసవ పున్నయ్య భవనం వరకు జరుగుతుందని తెలిపారు. ఈ ర్యాలీలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అనంతరం ఎంబివికెలో సోషలిజం ఔన్నత్యాన్ని, దాని అవశ్యకత, విశిష్టత, ప్రస్తుత పరిస్థితుల్లో సామ్రాజ్యవాద ప్రమాదం అనే అంశంపై సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యు సిహెచ్ బాబూరావు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు డి.కాశీనాథ్ పాల్గొని ప్రసంగిస్తారన్నారు. సభను జయప్రదం చేయాలని కోరుతూ వీరులపాడు, దొడ్డదేవరపాడు, అల్లూరు, చౌటుపల్లి, చట్టన్నవరం, జుజ్జూరు తదితర గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేసిన గ్రూప్ మీటింగ్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చాట్ల రవి, మండల కమిటీ సభ్యులు పల్లి కంటి బాబు, షేక్ లాలా అహ్మద్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జాన్ బాషా, సిపిఎం సీనియర్ నాయకులు కోడూరు పిచ్చేశ్వరావు పాల్గొన్నారు

ఎఎస్‌ఐ మంగ్యా నాయక్‌కు ఉత్తమ సేవా అవార్డు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మొంథా తుఫానులో ఉత్తమ సేవలు అందించిన వారికి సిఎం క్యాంపు కార్యాలయంలో ఆదివారం అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. విపత్తు సమయంలో ఉత్తమ సేవలు అందించిన 175 మందిని గుర్తించి వారికి సిఎం ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సైక్లోన్ మొంథా ఫైటర్లుగా గౌరవిస్తూ సర్టిఫికెట్లు, మెమోంటోలను ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా చిల్లకల్లు పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మంగ్యా నాయక్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపల్ ప్రత్యేకంగా అభినందించారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-వత్సవాయి : జగ్గయ్యపేట పట్టణానికి చెందిన తంగేళ్ల శ్రీనివాసరాజు, పూర్ణ కుమారి దంపతులు వారి కుమారుడు గోపాలకృష్ణ రాజు పేరుపై శ్రీ తిరుపతమ్మ అమ్మవారి నిత్యాన్నదానం పథకానికి రూ.10116 విరాళంగా అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ లక్ష్మన్‌కి ఆదివారం అందజేశారు. దాలకు ఆలయ అర్చకులు, పండితులతో వేద ఆశీర్వచనం చేశారు. అమ్మవారి శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కంపచెట్లు తొలగింపు

ప్రజాశక్తి-గంపలగూడెం: తిరువూరు ఏఎంసి పరిధిలో ఉన్న గంపలగూడెం మార్కెట్ యార్డ్ చుట్టూ ఏపుగా పెరిగిన కంప చెట్లను ఆదివారం జెసిబితో తొలగించారు. ఈ సందర్భంగా ఎఎంసి చైర్మన్ రేగళ్ల లక్ష్మీ అనిత మాట్లాడుతూ త్వరలో రైతుల సౌకర్యార్థం యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఈ పునరుద్ధరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే తిరువూరులో ఉన్న ఏఎంసీ ప్రధాన కార్యాలయం ప్రాంగణం గుంతలు ఏర్పడి అస్తవ్యస్తంగా ఉండటంతో పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు చెప్పారు.

ప్రమాదకంగా విద్యుత్ వైర్లు

ప్రజాశక్తి-గంపలగూడెం: గంపలగూడెం ప్రధాన రహదారి వెంట ఉన్న గృహాలకు చెందిన విద్యుత్ వైర్లు ప్రమాదకంగా మారాయి. విద్యుత్ సర్వీస్ వైర్లు క్రిందకు జారడంతో ప్రధాన రహదారిపై వాహనాలు నిలిచిపోయినాయి. ఆర్టీసీ బస్సులు, లారీలు, టిప్పర్లు పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక భజన మందిరం సమీపన ఆదివారం ఈ ఘటన జరిగింది. సంబంధిత అధికారులు స్పందించి కిందకు జారిన వైర్లను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ మండలంలోని బండపాలెం గ్రామంలో వైసిపి గ్రామ అధ్యక్షులు బండి రంజిత్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరించొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్, జిల్లా కార్యదర్శులు మాతంగి నాగబాబు, వేముల మల్లేశ్వరరావు, జిల్లా పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి శీలం మంగరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయం లేకుండా రైల్వే లైన్‌కు సర్వే - ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-వీరులపాడు : వీరులపాడు మండలం రైల్వే లైన్ నిర్మాణం కోసం ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. రైతుల అభిప్రాయాలు తెలియజేయాలని గతంలో నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం.. రైతులకు తెలియకుండా అధికారులకు రైతుల భూములకు సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని పెద్దాపురం, అల్లూరు, చెన్నారావు పాలెం, నరసింహారావు పాలెం గ్రామాల్లో నూతన రైల్వే లైన్ ఏర్పాటుకు రైతులకు సమాచారం ఇవ్వకుండా అధికారులు ఏకపక్షంగా కొలతలు నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక పంపండం సరికాదని రైతులు తెలిపారు. భూములు కోల్పోతున్న రైతుల సమక్షంలోనే భూములకు సర్వే నిర్వహించి, కొలతలు వేయాలని బాధిత రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఎల్పీ నెంబర్లు కాకుండా గతంలో ఇచ్చిన సర్వే నెంబర్ల ఆధారంగా రైతులకు నష్టం లేకుండా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని రైతులు, రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను సతీమణి విమల భాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలభాను జన్మదినాన్ని పురస్కరించుకొని సామినేని అభిమానులు పట్టణంలోని శ్రీ సంతాన వేణుగోపాల స్వామి వారి దేవస్థానంలో దీక్ష స్వాములకు అన్నదానం కార్యక్రమాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని జనసేన యువ నాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ బాబు పాల్గొని ప్రారంభించారు.



చెక్కు అందిస్తున్న దృశ్యం

మృతుడి కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి-నాగాయలంక : కార్యకర్తల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ అధిక ప్రాధాన్యతనిస్తోందని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని, వారి కుటుంబాలకు అండగా నిలుస్తామని పార్టీ జాతీయ కార్యదర్శి భరోసా ఇస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి, నియోజకవర్గం పార్టీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. నాగాయలంక మండలం పరచవర పంచాయతీ శివారు గనుపేశ్వరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త చాట్రగడ్డ సువార్తమ్మ మే 9వ తేదీన రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆమె భర్త బాబురావుకి రూ 5 లక్షల చెక్కును శ్రీనివాసరావు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, నాగాయలంక మండల పార్టీ అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, పార్టీ నేతలు మంచాల బాబు, పరుచూరి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



వెంకట కృష్ణారావుకు నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మండల వెంకట కృష్ణారావుకు చల్లపల్లి మండలం వెలుగోలు గ్రామానికి చెందిన కూటమి నాయకులు నివాళులర్పించారు. ఆదివారం రాజీవ్ సెంటర్లోని వెంకట కృష్ణారావు విగ్రహానికి ఆ గ్రామ సర్పంచ్ వేములమడ రజిత, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు మురాళ్ళ నాగేశ్వర రావు ఆధ్వర్యంలో కూటమి నాయకులు పూలదండలు వేసి నివాళులర్పించారు. టిడిపి నాయకులు వాసిరెడ్డి రాకేష్, గ్రామ ప్రముఖులు వేములవాడ నాని, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి అవనిగడ్డ ,చల్లపల్లి మండల పార్టీల నాయకులు యాసం చిట్టిబాబు, మోర్ల రాంబాబు, జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ తదదితరులు పాల్గొన్నారు.

ఈవిఆర్ మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - గుడివాడ : టిడిపి నేత స్వర్గీయ ఈడ్పుగంటి వెంకట రామయ్య పదో వర్ధంతి సందర్భంగా స్థానిక ఈవిఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో ఈవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు శిబిరంలో పాల్గొన్న ప్రజలకు ఉచిత వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఈడుపుగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈడుపుగంటి వెంకటరామయ్య జ్ఞాపకార్థం గత పది సంవత్సరాలుగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని,ఈ ఏడాది నవంబర్ ఒకటి, రెండు తేదీల్లో నిర్వహించిన శిబిరంలో సుమారు 7 వేల మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటుగా అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు, ఖరీదైన ఇంజక్షన్లు చేసినట్లు నిర్వాహకులు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుండె వైద్య నిపుణులు కర్నాటి రాజేంద్ర, పలువురు వైద్యులు హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.



ఈవిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న రోగులు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

స్థానిక పామర్రు రోడ్డు కోతిబొమ్మ సెంటర్ వద్ద ఉన్న డా.ప్రభావతి గార్డెన్స్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. రోటరీ ఆధ్వర్యంలో డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజ్ మరియు హాస్పటల్ సహకారంతో అందించే ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రోటరీ అధ్యక్షులు యలమంచిలి నాగేశ్వర రావు, పూర్వాధ్యక్షులు టి ఎన్ రాజశేఖర్, సుబ్రహ్మణ్యం, శంకర్రావు, ప్రోగ్రాం కన్వీనర్లు డా. సి.సూర్యచంద్రరావు, నర్సింగ్ హెడ్ జివి రాఘవమ్మ, పలువురు నర్సింగ్ విభాగం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ ప్రారంభం

ప్రజాశక్తి-ఘంటసాల : కూటమి నేతలు ఆస్తులు పెంచుకోవడానికే ప్రభుత్వ భూములను, వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ప్రజా వైద్యం - ప్రజల హక్కు అంటూ మెడికల్ కాలేజీల ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా వైఎస్సార్సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమ కార్యక్రమాన్ని ఘంటసాల గ్రామంలో సింహాద్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ వైద్య రంగాన్ని సువర్ణ అధ్యాయంగా మారిస్తే ప్రస్తుత సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఆ కార్యక్రమాన్ని నీరుగారుస్తూ ప్రజల ఆరోగ్యానికి భద్రత లేకుండా చేస్తున్నారన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలతో పాటు అన్ని వర్గాల విద్యార్థులకు వైద్య విద్య అందిచేందుకు ఉపయోగపడే వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసి విద్యార్థుల పొట్టకొట్టద్దంటూ వాపోతున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల అధ్యక్షులు వేమూరి వెంకట్రావు, జడ్పీటీసీ తుమ్మల మురళీ కష్ణ, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్ర బాబు, యువనేత వేమూరి ప్రవీణ్, నేతలు



ఘంటసాలలో కోటి సంతకాలు ప్రారంభిస్తున్న దృశ్యం

పరుచూరి రామకృష్ణ, దాసరి కుటుంబరావు, దోనే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు** : కంకిపాడు మండలం వేల్పూరు గ్రామంలో పెనమలూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి రచ్చబండ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వమించి గ్రామంలో నెలకొన్న సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జగన్ మోహన్ రెడ్డి తలపెట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకువస్తున్న చట్టాలు మెడికల్ విద్యార్థులకే కాదు బడుగ బలహీన ప్రజలందరికి నష్టమన్నారు. అనంతరం వేల్పూరు గ్రామ పార్టీ అధ్యక్షులుగా పామర్తి వెంకటేశ్వరావుని నియమించారు.

బిఫారం భూములకు బీమా సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-చల్లపల్లి : బిఫారం భూములకు బీమా సౌకర్యం కల్పించాలని ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.చల్లపల్లి మండలం ఆముదార్లంక లో మొంతా తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను ఆదివారం పరిశీలించి,రైతులతో మాట్లాడారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ లంక భూముల్లో వరుసగా వరదలు,తుఫాను ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను సామాజిక అంశం భావించా లన్నారు. విపత్తుల సమయంలో రైతులను ఆదుకోవడానికి సైనిక సంక్షేమ నిధి తరహాలో రైతు సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులు జి.రాజేష్,ప్రసాద్, పాములు, కొమ్ము ఇమ్మానుయేలు, రవిబాబు పాల్గొన్నారు.

కొండలమ్మ ఆలయంలో యాత్రికుల రద్దీ



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న కొండలమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకున్నారు. సుమారు 8వేల మంది యాత్రికులు అమ్మవారిని దర్శించుకొని వారి మొక్కుబడులను తీర్చుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే మోహన్ లు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అలాగే ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

జలదీశ్వర ఆలయాన్ని సందర్శించిన చాగంటి

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల గ్రామంలో ఉన్న శ్రీ బాల పార్వతీ సమేత జలదీశ్వర స్వామి వారిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు శిష్య బృందంతో కలిసి దర్శించుకుని అర్చకులు చావలి కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం కోటేశ్వరరావును ఆలయ అర్చకబందం, కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, ఘంటసాల పిఎసిఎస్ చైర్ పర్సన్ బండి పరాత్పరరావు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకష్ణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి** : నరకాసుర సంహార క్షేత్రంగా ఖ్యాతి గడించిన ప్రాచీన క్షేత్రం పథ్వీశ్వర క్షేత్రాన్ని వృద్ధిలోకితేవటం అభినందనీయమని ప్రముఖ ప్రవచనకర్త, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు ప్రశంసించారు. ఆదివారం చల్లపల్లి మండలం నడకుదురులోని ప్రాచీన శైవక్షేత్రం శ్రీ పథ్వీశ్వర స్వామి దేవస్థానాన్ని చాగంటి కోటేశ్వరరావు దర్శించుకున్నారు. ఆయనకు అవనిగడ్డ నియోజకవర్గం శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ స్వాగతం పలికారు. పథ్వీశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆయనకు ఆలయ అభివద్ధికర్త మండవ రవీంద్ర- రమణ కుమారి దంపతులు, డాక్టర్ యార్లగడ్డ మధు కిరణ్- డాక్టర్ మండవ సింధూర దంపతులు, దేవస్థానం ఈఓ యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు) సత్కరించారు.

క్రికెట్ తిలకించేందుకు ఎల్ఇడి తెర ఏర్పాటు

ప్రజాశక్తి-పామర్రు : మహిళల వన్డే క్రికెట్ ప్రపంచ కప్ పోటీలను తిలకించేందుకు ఆదివారం పామర్రు నాలుగు రోడ్ల సెంటర్లో స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆధ్వర్యంలో ఎల్ఈడి స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. ప్రతిష్టాత్మకంగా జరుగనున్న ఈ క్రికెట్ పోటీలను సామాన్య ప్రజలు తిలకించేందుకు ఈ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. దీంతో పామర్రు మీదుగా రాకపోకలు సాగించేవారు, స్థానిక ప్రజలు ఆసక్తితో తిలకించారు.

గౌతమ్ విదేశీ ప్రయాణాలకు అనుమతి తప్పనిసరి : జడ్జి

ప్రజాశక్తి-అవనిగడ్డ : వైసిపి నియోజకవర్గ యువ నాయకులు బడే గౌతం ఇకపై విదేశీ ప్రయాణాలకు కోర్టు అనుమతి తప్పనిసరిగా పొందాలని అవనిగడ్డ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వర్ణలత తీర్పు వెల్లడించారు. సీఎం చంద్రబాబునాయుడు, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ ఫ్లెక్సీల విషయంలో గౌతంపై కేసు నమోదయి ఉంది. దీనితో కేసులో గౌతం పాస్పోర్ట్ రీ-ఇష్యు కోసం కోర్టు అనుమతి కోరాల్సి ఉంది. విచారణ అనంతరం కోర్టు కేసు పెండింగ్లో ఉన్నంత మాత్రాన పాస్పోర్ట్ ఇవ్వడాన్ని నిరాకరించరాదని పేర్కొంటూ పాస్పోర్ట్ పునరుద్ధరణకు అనుమతి మంజూరు చేస్తూ తన విదేశీ ప్రయాణాలకు ముందు కోర్టు అనుమతి తప్పనిసరిగా పొందాలని జడ్జి స్పష్టం చేశారు.

ఎఐతో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

ప్రజాశక్తి - గుడివాడ : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాకతో వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్ పేర్కొన్నారు. ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడ శాఖ, ఆస్టర్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో వైద్యులకు నిరంతర వైద్య విద్యా కార్యక్రమాన్ని స్థానిక సత్యనారా



జ్యోతిప్రజ్వలన చేస్తున్న డా.రమేష్

యణపురంలోని ఐఎంఏ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా.పోతినేని రమేష్ నూతన సిటీ యాంజియోగ్రామ్ ప్రత్యేకతను పవర్ ప్రజెంటేషన్ ద్వారా వైద్యులకు వివరించి మాట్లాడారు. నేడు అందుబాటులోకి వచ్చిన అడ్వాన్స్డ్ వైద్య విధానంతో గుండె జబ్బులపై భయపడాల్సిన అవసరం లేదన్నారు. జీవనశైలిలో మార్పులు, వ్యాయామం, ఆహారపు అలవాట్లు, బిపి నియంత్రణ వంటి జాగ్రత్తలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాకతో వైద్యరంగంలో అనేక మార్పులు వచ్చాయని, తక్కువ ఖర్చుతోనే అత్యాధునిక వైద్యం అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. కరోనా వ్యాక్సిన్‌ల వల్లనే గుండె పోటు మరణాలు పెరుగుతున్నాయన్నది వాస్తవమని, జెనెటిక్ సమస్యల వల్లనే చిన్న పిల్లల్లో గుండె సమస్యలు వస్తున్నాయని డా.రమేష్ పేర్కొన్నారు. ఐఎంఏ గుడివాడ శాఖ అధ్యక్షులు డాక్టర్ మాగంటి శ్రీనివాస్, గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ఐఎంఏ సభ్యులు డా. పాలడుగు వెంకట్రావు, డా.మన్నెం భవాని శంకర్ పాల్గొన్నారు.

పృథ్వీశ్వర స్వామిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



ఆలయంలో జడ్జి అనుపమ చక్రవర్తి

ప్రజాశక్తి-చల్లపల్లి : మండల పరిధిలోని నడకుదురు శ్రీ పృథ్వీశ్వర స్వామి వారి దేవాలయాన్ని పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జి. అనుపమ చక్రవర్తి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించు కున్నారు. ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు న్యాయమూర్తి దంపతులకు స్వాగతం పలికారు. స్వయంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేయగా, ఆలయ అర్చకులు ఆలయ విశిష్టత,క్షేత్ర ప్రాధాన్యతను తెలియజేసి ఆశీర్వచనాలు అందజేశారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ఉచిత శిక్షణ



విజయవాడ : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసిన విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు విజయవాడ వన్‌టౌన్‌లోని మోటూరు హనుమంతరావు శ్రామిక భవన్‌లో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ కేంద్రాన్ని గణిత రిసోర్స్ పర్సన్ లెనిన్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో ఉండే ఆలోచనా శక్తి పెరగడానికి ఈ పరీక్ష చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. పరీక్ష రాసేందుకు పలు ఆయన సూచనలు ఇచ్చారు. ఎన్.ఎం.ఎం.ఎస్ శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చిన హరిగోపాల్‌ను ఆయన అభినందించారు. లెనిన్, హరిగోపాల్ ఇరువురు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణా కేంద్రం కన్వీనర్, జెవివి రాష్ట్ర కార్యదర్శి బి రవి మాట్లాడుతూ నిరంతర కృషితో మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ శిక్షణా కేంద్రాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.



చిన్నారుల ప్రతిభకు పట్టం

విజయవాడ : రాష్ట్ర అవతరణ దినోత్సవాల్లో భాగంగా శ్రీ వాగ్దేవి కూచిపూడి నృత్యాలయం ఆధ్వర్యంలో "నృత్యహేల - 2025" కార్యక్రమం ఆదివారం సాయంత్రం గాంధీనగర్ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ప్రముఖ నాట్యాచార్యులు అనూషానాయుడు, అనిత, నరేంద్ర కుమార్ తదితర గురువుల వద్ద శిష్యరికం చేస్తూ విశేష ప్రతిభ కనబరుస్తున్న 30 మందికి పైగా చిన్నారులకు శ్రీ వెంకటేశ్వర, స్వర్ణ నంది, నర్తనమయూరి అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని ప్రముఖ నాట్యాచార్యులు సప్పా శివకుమార్ నిర్వహించారు. ప్రముఖ నాట్యాచార్యులు పిళ్లా ఉమామహేశ్వర పాత్రుడు, ఎం. త్రినాథాచారి, ఘంటసాల పవన్ కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

వెంకటలక్ష్మి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రభుత్వానికి వారధి అయిన సమాచార పౌర సంబంధాల శాఖలో అత్యంత సమర్థవంతంగా సేవలందించి అధికారుల మన్నల పొందిన జాస్తి వెంకట లక్ష్మిని నేటి తరం ఉద్యోగుల ఆదర్శంగా తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ ఎస్.దిల్లీరావు అన్నారు. విజయవాడ రాష్ట్ర సమాచార కేంద్రం, లైబ్రేరియన్‌గా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన జాస్తి వెంకట లక్ష్మికి తాడేపల్లిలోని కొండపావులూరి గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన అభినందన కార్యక్రమానికి పౌర సరఫరాల డైరెక్టర్ ఎస్.ఢిల్లీ రావు, ఎపిఎన్‌జిఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ హాజరై వెంకటలక్ష్మి ప్రసాద్ దంపతులను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆమె సేవలు నేటి తరం వారికి స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. విద్యాసాగర్ మాట్లాడుతూ.. ప్రభుతవానికీ ప్రజలకు వారిధిలా నిలిచే సమాచార శాఖలో పనిచేసే ఉద్యోగులు సమర్థవంతంగా పని చేస్తేనే ప్రభుత్వాని మంచి పేరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమం ఎన్‌జిఓ నేతలు కె.జగదీశ్వర రావు, డిఎస్ఎన్ రెడ్డి, పి.రమేష్, సివిఆర్ ప్రసాద్, నజీరుద్దీన్ పాల్గొన్నారు.



అంబేద్కర్ స్మృతివనం నిర్వహణపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



ప్రజాశక్తి-విజయవాడ : రాజ్యాంగ నిర్మాత, దేశాభ్యుదయానికి జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని.. ఆయన ఆశయాలను, మేధో సంపత్తిని తరతరాలకు అందించేందుకు ఆయన పేరిట ఏర్పాటు చేసిన స్మృతివనం నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించిందని, మహనీయునికి విశిష్ట గౌరవం కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రలతో కలిసి సమన్వయ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్మృతివనం నిర్వహణలో ఎలాంటి అలసత్వానికి చోటులేదని, ఇప్పటివరకు నిర్వహణ బాధ్యతలు చూసిన కాంట్రాక్టు సంస్థను తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. పారిశుధ్య కార్మికులకు జీతాలు, ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని ఆ సంస్థను ఆదేశించామని తెలిపారు. ఈ ఆదేశాలను బేఖాతరు చేస్తే బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. స్మృతివనం నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖలకు అప్పగించడం జరిగిందన్నారు. ఈ శాఖల ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం నిరంతర ప్రత్యక్ష పర్యవేక్షణ ఉంటుందని, ఇందులో భాగంగా ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ డా. బీఆర్ అంబేద్కర్ ఆశయాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలిచేలా నిరంతర అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో విజయవాడ నగరపాలక సంస్థ, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖలు, ఏపీఐఐసీ, సాంఘిక సంక్షేమం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయవాడ : కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా సోమవారం ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పిజిఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను meekosam.ap.gov.in వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చని, నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

బ్యారేజీకి కొనసాగుతున్న వరద

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నదికి వరద ప్రవాహం కొనసాగుతుంది. ఆదివారం రాత్రి 9 సమయానికి ఎగువ ప్రాంతాల నుంచి బ్యారేజ్ వద్ద 1,58,175 క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తుంది. దీంతో బ్యారేజీ 69 గేట్లలో 29 గేట్లను నాలుగు అడుగులు, 44 గేట్లను మూడు అడుగుల మేర పైకి ఎత్తి వచ్చిన వరదను వచ్చినట్లుగా దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 12 అడుగులుగా ఉందని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. కృష్ణా డెల్టా ప్రధాన కాలువలకు నీటి విడుదల నిలిపివేశారు.

తెలుగు భాషను భావితరాలకు అందించాలి

- తెలుగు అకాడమీ చైర్మన్ శరత్చంద్ర



విజయవాడ : ఘన చరిత్ర కలిగిన తెలుగు భాష వారసత్వ సంపదను భావితరాలకు సమున్నతంగా అందించనున్నామని తెలుగు అకాడమీ చైర్మన్ శరత్చంద్ర పేర్కొన్నారు. గాంధీనగర్ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భాషను రక్షించుకోపోతే భావితరాలు క్షమించవన్నారు. తెలుగు భాష చరిత్ర, కళలు, సాహిత్యాన్ని విస్తతంగా జనంలోకి తీసుకెళ్లేందుకు ప్రఖ్యాత సాహిత్యాన్ని పునర్ముద్రించడానికి కూడా అకాడమీ పూనుకోనున్నదని వెల్లడించారు. తెలుగు భాష వినియోగాన్ని సగర్వంగా భావించాలని సూచించారు. భాషకు సంబంధించి సంధి కాలంలో ఉన్న ప్రస్తుత తరుణంలో భాష అభివద్ధికి సమైక్యంగా పూనుకోవాలన్నారు. తెలుగు భాషోద్యమ నాయకులు డాక్టర్ సామల రమేష్ బాబు మాట్లాడుతూ తెలుగుజాతి ఐక్యతకు మహోద్యమం నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు, నెల్లూరు జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు ఎ.జయప్రకాష్ అధ్యక్షత వహించారు. సనాతన ధర్మ ధర్మాచరణ పరిషత్ అధ్యక్షులు జి.కె.ఆర్. నాగభూషణరావు తదితరులు కూడా ప్రసంగించారు. సమైక్య భారతి, ఏపీ తెలుగు భాష పరిరక్షణ సమితి సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమానికి తెలుగు కళావాహిని, కా. జి ఆర్ కె – పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి సహకరించాయి. ఆహ్వాన సంఘం సమన్వయకర్త పి. కన్నయ్య నేతత్వం వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి అధ్యక్షుడు పి.చంద్రనాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య అభ్యుదయ గీతాలను ఆలపించారు. సీహెచ్.చిట్టిబాబు, కె.డేవిడ్ రాజు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తెలుగు చలనచిత్ర సంగీత దర్శకులు సాలూరు రాజేశ్వరరావు, పెండ్యాల నాగేశ్వరరావు సినీ సంగీత విభావరి కూడా నిర్వహించారు.

దుర్గమ్మ సేవలో సిపి దంపతులు



ప్రజాశక్తి-విజయవాడ సిటీ : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్‌వి రాజశేఖర్ బాబు దంపతులు దర్శించుకున్నారు. ఆదివారం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంకు విచ్చేసిన రాజశేఖర్ బాబుకు దేవస్థాన సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం సిపి దంపతులకు పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. దేవస్థానం అధికారులు శేష వస్త్రంతో సత్కరించి, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను బహుకరించారు.



అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ : ఫ్రెండ్స్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ ఆశిష్ స్టూడియోలో ఆదివారం రాత్రి తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి (కరోకే) హాయిగా సాగింది. ప్రముఖ ఔత్సాహిక గాయనీ గాయకులు ఆర్.ఎల్.వసంత్ కుమార్, రాపాటి శ్రీనివాస్ (టీం లీడర్స్), ఆర్.ఎల్. బాలాజీ కుమార్ (వ్యాఖ్యాత), సత్య స్వాతి (స్టూడియో యజమాని), మల్లేశ్వరి బొబ్బిలి, చింత రజని,. ఎ.జయప్రభ తదితరులు వివిధ చిత్రాల్లోని హిట్ సాంగ్స్ చక్కగా పాడి ప్రేక్షకుల్ని అలరించారు.



పిఎన్‌బి ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్నెస్ వాక్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆధ్వర్యంలో నగరంలో విజిలెన్స్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా విజిలెన్స్ వాక్ నిర్వహించారు. విజయవాడ సర్కిల్ ఆఫీస్ ఆధ్వర్యంలో ఎం.జి రోడ్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని సర్కిల్ హెడ్ పంకజ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిజాయతీతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం సర్కిల్ కార్యాలయంలో రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో రక్త దాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు శాఖల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కవితల పోటీల్లో రఘునందన్‌కు బహుమతి



ప్రజాశక్తి - తిరువూరు : శ్రీహరి కోటలోని షార్ వాణి మాసపత్రిక యాజమాన్యం ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన కవితల పోటీలో తిరువూరుకు చెందిన ప్రముఖ కవి రేపాక రఘునందన్ రచించిన 'వాన ప్రేమించిన క్షణాలు' కవితకు తృతీయ బహుమతి లభించింది. ఈ మేరకు పత్రిక ప్రధాన సంపాదకుడు గారపాటి సూర్యనారాయణ సమాచారం పంపినట్లు రఘునందన్ తెలిపారు. గతంలో కూడా అనేక జాతీయ పోటీల్లో బహు మతులు గెలుచుకున్న రఘునందన్ ప్రస్తుతం అరసం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శిగా, తిరువూరు రచయితల సంఘం (తిరసం) ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తూ సాహితీ సేవ చేస్తున్నారు. రఘునందన్‌కు జాతీయ స్థాయిలో బహుమతి రావడం పట్ల తిరసం అధ్యక్షురాలు ఉయ్యూరు అనసూయ, సాహితీ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.